క్లుప్తంగా

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వెంకటేగౌడ



జగన్‌మోహన్‌రెడ్డితో వెంకటేగౌడ

పలమనేరు: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుల ఆదేశాల మేరకు చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని వెంకటేగౌడ తెలిపారు. ఐదు వారాలపాటు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

వెల్ఫేర్ ఆఫీసర్ మృతి



మహేశ్వరి (ఫైల్)

సదుం: స్థానిక బీసీ బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మహేశ్వరి (56) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆమె బెంగళూరులో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె భర్త జయకుమార్‌రెడ్డి సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్నారు. అంత్యక్రియలు గురువారం ఉదయం 10 గంటలకు పాలమందలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆమె మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురి ఎంపిక

సదుం: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి బుధవారం తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన సుదర్శన్, వినయ్, రెడ్డి ప్రసాద్, పవన్‌కుమార్, మధు, అన్షిద్ ఎంపికైనట్లు ఆయన చెప్పారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



డా.వేణుగోపాల్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డా.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారిణి డా.షమమారెహ్మాన్ సాధారణ బదిలీల్లో ఎస్ఆర్.పురం పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద పీహెచ్‌సీ నుంచి డా.వేణుగోపాల్‌రెడ్డి ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషిచేస్తానని తెలిపారు

పెద్దపంజాణి తహసీల్దార్‌గా హనుమంతు



బాధ్యతలు స్వీకరించిన హనుమంతు

పెద్దపంజాణి: తహసీల్దార్‌గా హనుమంతు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చౌడేపల్లె నుంచి పెద్ద పంజాణికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా నూతన తహసీల్దార్ హనుమంతు, బదిలీపై పలమనేరుకు వెళుతున్న అనిల్‌కుమార్‌రెడ్డిని వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో డీటీ యుగేష్‌రెడ్డి, ఆర్ఐ రాకేష్‌కుమార్, రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యంఆచారి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ



కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వైఎస్సార్ కడప ఆర్జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కొత్త అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి సిబ్బంది సమష్టిగా ప్రచారం నిర్వహించాలన్నారు. కళాశాలలోని రికార్డుల తోపాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ అంశాలపై సిబ్బందితో చర్చించారు. ఈనెల 30న కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ ఉద్యోగ విరమణ పొందనున్నట్లు తెలిపారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌గా సురేష్‌కుమార్‌రెడ్డి



సురేష్‌కుమార్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్‌గా సురేష్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న నవీన్ రొంపిచెర్లకు బదిలీ అయ్యారు. రొంపిచెర్లలో పనిచేస్తున్న సురేష్‌కుమార్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు

కొనేది ఇక్కడ.. అమ్మేది అక్కడ

- ర్యాంపుల నుంచి పొరుగు రాష్ట్రాలకు తోతాపురి
- క్రిష్ణగిరి, హోస్కోట ఫ్యాక్టరీలకు
- రైతులకు నష్టాలు, వ్యాపారులకు లాభాలు
- తోతాపురి రైతుల పరిస్థితి ఇది



గాజులపల్లి వద్ద రోడ్డుపై మామిడి కాయలను పడేసిన రైతులు



ర్యాంపుల నుంచి పొరుగు రాష్ట్రాలకు పోతున్న తోతాపురి

పలమనేరు: కూటమి ప్రభుత్వ విధానాలతో ఈదఫా జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యారు. మామిడి గుజ్జు పరిశ్రమల్లో కిలోకి రూ.8 లేదా రూ.7కాదు రూ.6 ఇస్తామని అధికారులు ఇన్నాళ్లు చెప్పిన మాట. కానీ ఫ్యాక్టరీలు భారీగా డిమాండ్ పెట్టి రైతుల మామిడి కొనకుండా కేవలం కిలో రూ.5 మాత్రమే ఇస్తున్నారు. అధికూడా ధరతో పనిలేకుండా కాయలు అమ్ముడైతే చాలనే చందాన పరిస్థితి తయారైంది. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు పడేకంటే ర్యాంపుల్లో అమ్మేద్దామని పలువురు రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారేమో దొరికిందే చాన్సంటూ కిలో రూ.2 నుంచి రూ.2.50 పైసల దాకా తోతాపురిని కొంటున్నారు. ఈ సరుకును పొరుగునే ఉన్న కర్ణాటక, తమిళనాడులోని పల్ప్ ఫ్యాక్టరీలకు పంపి కిలో మామిడి రూ.4 దాకా అమ్ముకుంటున్నారు. ఆరుగాలం పండించిన రైతుకేమో నష్టాలు. అప్పుడే కొన్న వ్యాపారికేమో లాభాలు. ఏడాది పండించిన పంటను చెట్లలో వదిలేందుకు మనసురాని రైతులు వాటిని ఎలాగైనా విక్రయించాలని నష్టాలబాటలో పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు.

తోతాపురి రైతులకే కష్టాలన్నీ..

జిల్లాలో 60వేల హెక్టార్లలో మామిడి తోటలుండగా ఇందులో తోతాపురి తోటలే 36వేల హెక్టార్లుగా ఉన్నాయి. ఈ కాయలు కచ్చితంగా మామిడి గుజ్జుకు పోవాల్సిందే. ఆమేరకు ఈదఫా 4.60 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి దిగుబడి ఉంది. ఇందులో కేవలం లక్ష మెట్రిక్ టన్నుల కాయలు మాత్రం జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు వెళ్లగా మిగిలిన సరుకు ఆయా ప్రాంతాల్లోని ర్యాంపులు లేదా ముందుగా తోటలు అమ్మిన వ్యాపారులకు చేరింది. జిల్లాలో మొత్తంగా 39 ర్యాంపులున్నాయి. ఫ్యాక్టరీల వద్ద సరుకు అమ్ముడుపోనందున రైతులు ఎంత వస్తే అంత అంటూ సమీపంలోని ర్యాంపుల్లో తోతాపురిని విక్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు కిలో రూ.2 నుంచి 2.50 పైసలకు కొంటున్నారు. ఫలితంగా తోతాపురి సాగు చేసిన రైతులకు తీవ్రమైన నష్టాలు తప్పడంలేదు.

పొరుగు రాష్ట్రాల నుంచి తోతాపురి వద్దని...

జిల్లాకు ఆనుకొని ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి తోతాపురి రాకుండా అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో ఆ రాష్ట్రాల నుంచి మామిడి కాయలు ఇక్కడికి రావడం లేదు. అయితే ఇక్కడి సరుకును ఫ్యాక్టరీలు కొనుగోలు చేయడంలేదు. ఇదే అదునుగా చూసుకున్న ర్యాంపు వ్యాపారులు ఇక్కడి సరుకును కారుచౌకగా కొని పొరుగు రాష్ట్రాల్లోని పల్ప్ ఫ్యాక్టరీలకు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వ పాలసీ బాగోలేదు..



ఈ దఫా మామిడి రైతులను నిండా ముంచింది ప్రభుత్వమే. అసలు మామిడి కాయలను ఎలా ఫ్యాక్టరీలకు అమ్మాలి, రైతులకు ధర ఎలా గిట్టుబాటు కల్పించాలనే ప్లానింగ్ లేదు. అధికారులు చెప్పిన మాటను ఫ్యాక్టరీ వాళ్లు ఎందుకు పట్టించుకుంటారు. పొరుగు రాష్ట్రాల్లో కిలో మామిడి రూ.3గా ఉంటే అక్కడి వ్యాపారులు ఇక్కడికి వచ్చి ప్రభుత్వం చెప్పిందని ఎక్కువ ధరకు ఎవరైనా కొంటారా. అందుకే ఇక్కడి సరుకును వ్యాపారులు పక్క రాష్ట్రాల్లో అమ్ముకుంటున్నారు.

నియాజ్, మామిడి వ్యాపారి, పలమనేరు

తోతాపురి రైతులకు కష్టమే..



నేను ముప్పై ఏళ్లుగా తోతాపురి సాగుచేస్తున్నా. ఏటా డైరెక్ట్‌గా పల్ప్ ఫ్యాక్టరీలకు సరుకు తోలేవాన్ని. ఈ దఫా ధరలు లేక కొనేవారు లేక అడిగిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే 30 ఎకరాల మామిడి తోటను తీసేసి వేరే పంట పండిద్దామని అనుకుంటున్నా. ఈ దఫా దెబ్బకు రాబోయే రోజుల్లో మామిడి రైతులు కోలుకొనే పరిస్థితి లేదు.

సుబ్రమణ్యంనాయుడు, మామిడి రైతు, రామాపురం

నోటీస్ బోర్డు

• 30న పౌరహక్కుల దినోత్సవం

సదుం: మండలంలో ఈనెల 30న పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. మారుతివారిపల్లె ఎస్సీ కాలనీలో ఆరోజు సాయంత్రం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని ఆమె పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

నేటి నుంచి నవరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పలమనేరు: పట్టణంలోని పాతపేటలో వెలసిన కనకదుర్గాదేవి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా గురువారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

• మర్యాదపూర్వక కలయిక



జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అనూషారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి

పుంగనూరు(చౌడేపల్లె): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అనూషారెడ్డి, ఎన్.శ్రీనాథరెడ్డి, ఎన్.ఉజ్వల్ కృష్ణారెడ్డి, వేంపల్లె సతీష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి నేతలు చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలపై చర్చించారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



మొక్కలు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు ప్రతినిధులు

శాంతిపురం: మొక్కల పెంపకంతోనే భూమిపై జీవరాసుల మనుగడ సాధ్యమని గ్రేసీ మేరియా ట్రస్ట్ ప్రతినిధులు ఆరోగ్యరాజ్, జేసుమేరి తెలిపారు. దండికుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక్కో విద్యార్థికి ఒక మొక్కను అందించి, వాటిని సంరక్షించే బాధ్యతను అప్పగించారు. ఆరవ తరగతిలో చేరిన విద్యార్థులు ఐదేళ్లపాటు తమ తమ మొక్కలు పెంచితే అవి వృక్షాలుగా ఎదుగుతాయని చెప్పారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి 10వ తరగతి పూర్తయ్యే వరకు వాటిని పెంచాలని కోరారు. టీచర్లు మల్లికార్జున, దయానంద్, ట్రస్టు సిబ్బంది జేసుమేరి పాల్గొన్నారు.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని మదనపల్లె రోడ్డులోగల బ్రిటిష్ హోటల్ సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి అడ్డురావడంతో అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మండలంలోని మిట్టచింతవారిపల్లెకి చెందిన దంపతులు రమేష్(38), పవిత్ర (30) బైక్ నుంచి కిందపడి గాయపడ్డారు. గాయపడ్డ వీరిని స్థానికులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా లాటరీ టికెట్ల విక్రయాలు

- అమాయకుల జేబులకు చిల్లు
- నాశనమవుతున్న మధ్యతరగతి కుటుంబాలు

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని ప్రధాన కూడళ్లలో లాటరీ టికెట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందంగా రోజురోజుకు జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు లాటరీ టికెట్ల వ్యాపారంపై దృష్టి సారించకపోవడంతో రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఒక్కొక్క టికెట్ ధర రూ.200 పెట్టి కొనుగోలు చేస్తే అదృష్టం బాగుంటే రూ.4 వేల నుంచి రూ.8 లక్షల వరకు పొందే అవకాశం ఉంది. లాటరీ టికెట్ల విక్రయించే ఏజెంట్లు కూలీ చేసుకునే సామాన్యులకు ఎరచూపి జేబులకు చిల్లు పడే విధంగా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రూ.200 ఇచ్చి టికెట్ కొంటే లక్షలు వస్తాయని ఆశపడిన వారికి చివరికి ఉదయం నుంచి కాయకష్టం చేసి సంపాదించిన డబ్బులు లేక వట్టి చేతులు మిగులుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రోజూ కష్టపడి సంపాదించిన రూ.500 డబ్బుల్లో సగం లాటరీ టికెట్లకే ఖర్చు అయితే మిగిలిన డబ్బులు కుటుంబ అవసరాలకు చాలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని గోకుల్ సర్కిల్, బస్టాండ్, ఇందిరాసర్కిల్, తూర్పుమొగసాల, సెంటర్‌లాడ్జి, ప్యాలెస్ కాంపౌండ్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా లాటరీ టికెట్ల విక్రయాలు సాగుతున్నాయి. రోజూ లక్షలాది రూపాయల విక్రయాలు జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ఒరిజినల్ లాటరీ టికెట్లు పోలిన డూప్లికేట్ టికెట్లు కూడా తయారు చేసి అమాయకులను నిలువునా దోచేస్తున్నారని చర్చ సాగుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి లాటరీ టికెట్ల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై సీఐ సుబ్బరాయుడును వివరణ కోరగా లాటరీ టికెట్ల అమ్మకాలు విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రత్యేక సిబ్బందిని కేటాయించి విక్రయాలపై నిఘా ఏర్పాటుచేశామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



జేసీబీలతో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచి ప్రాంతంలో హైరోడ్డు విస్తరణ పనులను జోరుగా చేపడుతున్నారు. ఇందులోభాగంగా బుధవారం కట్టమంచిలో రోడ్డు ఆక్రమణ తొలగింపునకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. సీపీ నాగేంద్ర ఆదేశాల మేరకు ప్రణాళిక విభాగం అధికారులు భవన ప్లాన్ అప్రూవల్ ప్రకారం అక్రమ కట్టడాలను జేసీబీలతో తొలగించారు. రోడ్డు విస్తరణకు సహకరించాలని నాగేంద్ర కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి



బాలాజి (ఫైల్)

గంగవరం: ఆర్థిక ఇబ్బందులతో పది రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు..కలగటూరు గ్రామానికి చెందిన బాలాజి(34) కూలీ. ఇతను ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. తీవ్ర ఒత్తిడికి గురైన ఇతను పది రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని పలమనేరులో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారం రోజుల చికిత్స అనంతరం రెండు రోజులు క్రితం ఇంటికి తిరిగి వచ్చాడు. బుధవారం మళ్లీ అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు అతన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అతన్ని తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేటి నుంచి వైష్ణవీదేవి ఆలయంలో పూజలు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల వైష్ణవీదేవి ఆలయంలో నేటి నుంచి జూలై 4వరకు వారాహిదేవి నవరాత్రుల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆషాడ శుక్ల పాడ్యమి నుంచి ఈ కార్యక్రమం ఆలయంలో ప్రారంభమవుతుందన్నారు. నవరాత్రులు సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ తలుపులు తెరిచి ఉంటాయని, ప్రత్యేక అభిషేకాలు, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గడువు పొడిగింపు

పుంగనూరు(చౌడేపల్లె): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని వ్యవసాయ పాలటెక్నిక్ కళాశాల అడ్మిషన్లు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యూ.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పాస్, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లొమో కోర్సుల్లో చేరవచ్చునన్నారు. పది మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని, ప్రవేశ పరీక్షలు ఉండవని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

నేడు మాదక ద్రవ్య నివారణపై ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ : మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్థాయిలో గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు గాంధీ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తారన్నారు.

క్యాంపులను సద్వినియోగం చేసుకోండి



దుర్గసముద్రంలో నమోదు పత్రాలను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి సుభాషిణి

చౌడేపల్లె: మారుమూల గిరిజన ప్రజలకు సౌకర్యంగా ప్రభుత్వం చేపట్టిన ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లీలామాధవి సూచించారు. బుధవారం చౌడేపల్లె, దుర్గసముద్రం పుదిపట్ల గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ క్యాంపులను నిర్వహించారు. దుర్గసముద్రం, పందిళ్లపల్లె పంచాయతీ పరిధి గ్రామాల్లోని గిరిజనులు 37 మందికి ఆధార్ కార్డులను నమోదు చేశారు. వీటికి దుర్గసముద్రం పంచాయతీ సర్పంచ్ సరస్వతమ్మ ఆర్థిక చేయూతనిచ్చినట్లు తెలిపారు. అలాగే మరో రెండు ప్రదేశాల్లో నిర్వహించిన క్యాంపుల ద్వారా ఆధార్‌కార్డులు లేనివారితోపాటు పాత కార్డుదారులున్న వారు 50 మంది సవరణలు చేసుకున్నట్లు చెప్పారు. రెండు రోజులపాటు క్యాంపులు ఉంటాయని ఆమె అన్నారు. పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, డిజిటల్ అసిస్టెంట్లు వంశీధర్, నందకుమార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేయాలని కోరారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తునే ఉంటామని హెచ్చరించారు.

చినుకుపడితే జలమయం



ఈద్గా వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమైయ్యాయి. రామసముద్రం రోడ్డుపై ఈద్గా వద్ద వర్షపు నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు. తేలికపాటి వర్షాలకే ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన అర్జున తపస్మాన్



తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

పూతలపట్టు(యాదమరి): మండల పరిధిలోని పోటుకనుమలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. అర్జున తపస్మాన్ కార్యక్రమం బుధవారం భక్తులను అలరించింది. ఇంద్ర సుతుడు అర్జునుడు శివుడిని మెప్పించి పాశుపతాస్త్రం పొందే క్రమంలో అర్జున వేషధారి పాడిన పద్యాలు, పాటలు భక్తులను ఎంతగానో మెప్పించాయి. అర్జునుడిగా తారక్, శివునిగా త్యాగ, పార్వతిగా ధనలక్ష్మి నటన ప్రేక్షకులను రంజింపజేసింది. సంతానం లేని మహిళలు తపస్మాన్ వద్ద ఒరపడ్డారు. దీనికి భానుమూర్తి నాయుడు కుటుంబం ఉభయదారుగా వ్యవహరించింది. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం రాత్రి శ్రీ వేంకటేశ్వర నాటక కళామండలి కిరణ్ బృందం వారిచే గయోపాఖ్యానం నాటకాన్ని భక్తులను ఆకట్టుకునేలా ప్రదర్శించారు.

ఇందిరమ్మ కాలనీలో గంగజాతర



నడివీధిలో కొలువుదీరిన గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువు దీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.